హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్

అడివిశేషు 'హిట్ 2' సినిమా ముగింపులోనే 'హిట్ 3' నాని హీరోగా ఉంటుందని చెప్పేశాడు దర్శకుడు శైలేష్ కొలను. తొలి రెండు భాగాలు పెద్ద హిట్లు అవ్వడం, దానికి తోడు మూడో పార్ట్ హీరో నాని కావడంతో ఈ ఫ్రాంచైజీపై విపరీతమైన హైప్ ఏర్పడింది. 'హిట్ 3' అధికారిక ప్రకటన కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో 'హిట్ 3'పై అప్‌డేట్ రానేవచ్చేసింది. గురువారం 'HIT: The 3rd Case' మూవీకి సంబంధించిన ఆఫీషియల్ అనౌన్స్‌మెంట్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇందులో భాగంగా నాని పాత్రపై స్నీక్ పీక్ అందిస్తూ, ఓ గ్లింప్స్‌ని విడుదల చేశారు. మంచు పర్వతాల మధ్య కారుతో దూసుకుపోతున్న హిట్ ఆఫీసర్‌ని ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు ఛేజ్ చేస్తుండగా ఈ గ్లింప్స్ మొదలైంది. హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని సిగార్ తాగుతూ, రక్తపు చేతులతో కారు నడుపుతూ, మరోవైపు గొడ్డలితో స్టైలిష్‌గా ఫెరోషియస్‌గా కనిపించారు. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె.మేయర్, నిర్మాత: ప్రశాంతి త్రిపురనేని, నిర్మాణం: వాల్‌పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్.

వరద బాధితులకు అండగా నిలుస్తాం

సురేష్‌బాబు కోటి, దిల్‌రాజు 50 లక్షల విరాళం

ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులను ఆదుకునేందుకు తెలుగు చిత్ర పరిశ్రమ ఎప్పుడూ ముందుంటుందని, తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంభవించిన వరదల వల్ల ఎంతో మంది నిరాశ్రయులయ్యారని, వారికి సహాయం చేసేందుకు టాలీవుడ్ కలిసికట్టుగా ముందుకెళ్తుందని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రకటించింది. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఛాంబర్ గౌరవ కార్యదర్శి దామోదరప్రసాద్ మాట్లాడుతూ 'ఫిల్మ్ ఛాంబర్ తరపున రెండు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు 25 లక్షల చొప్పున 50 లక్షలు విరాళంగా ప్రకటిస్తున్నాం. ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ తరపున ఉభయ రాష్ట్రాలకు చెరో పది లక్షలు అందజేస్తాం' అన్నారు. తమ కుటుంబం నుంచి రెండు రాష్ట్రాలకు కలిపి కోటి రూపాయల విరాళాన్ని ప్రకటిస్తున్నామని నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు తెలిపారు. తమ నిర్మాణ సంస్థ నుంచి రెండు రాష్ట్రాలకు చెరో 25 లక్షలు ఇవ్వబోతున్నట్లు నిర్మాత దిల్‌రాజు పేర్కొన్నారు. నేడు అన్ని యూనియన్లతో సమావేశం నిర్వహించి ఒకరోజు వేతనం ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నామని ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ చెప్పారు.

భక్తి ప్రధాన గీతం గజానన

సుదర్శన్ పరుచూరి హీరోగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ సెలబ్రిటీ'. రవికిషోర్ దర్శకుడు. ఆర్‌పీ సినిమాస్ పతాకంపై చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో వరలక్ష్మీ శరత్‌కుమార్, శ్రీదీక్ష, నాజర్, రఘుబాబు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'గజానన' అనే దైవభక్తి ప్రధానంగా సాగే పాటను రిలీజ్ చేశారు. ఇందులో వరలక్ష్మీ శరత్‌కుమార్ అభినయం, నృత్యం ఆకట్టుకునేలా ఉంది. గణేష్ రాసిన ఈ పాటకు వినోద్ బాణీ అందించాడు. వినాయకచవితి నవరాత్రుల్లో మార్మోగిపోయే పాట ఇదని, త్వరలోనే రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, దర్శకత్వం: రవికిషోర్.

సందేశంతో 'పోలీసు వారి హెచ్చరిక'

రవికాలె, అజయ్‌ఘోష్, సంజయ్ నాయర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లి జనార్ధన్ నిర్మాత. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ ఆవిష్కరించారు. పోలీసును తుపాకులతో కట్టి బంధించిన పోస్టర్ ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. వినూత్నమైన కథాంశంతో సామాజిక సందేశంతో ఈ సినిమాను తెరకెక్కించామని దర్శకుడు తెలిపారు. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్స్ కార్యక్రమాలు జరుగుతున్నాయని నిర్మాత బెల్లి జనార్ధన్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కొండపల్లి నళినీకాంత్, సంగీతం: గజ్వేల్ వేణు, రచన-దర్శకత్వం: బాబ్జీ.

రెక్కల గుర్రంపై జగదేకవీరుడు?

చిరంజీవి 'విశ్వంభర' తెలుగుతెరపై ఇప్పటివరకూ రాని అడ్వంచరస్ సోషియో ఫాంటసీ అద్భుతమని మేకర్స్ చెబుతున్నారు. అందమైన చందమామ కథలా అనిపించే ఈ ఫాంటసీ థ్రిల్లర్‌లో చిరంజీవి కారణజన్ముడైన భూలోకవీరుడిగా కనిపించనున్నాడని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు వశిష్ఠ విజువల్ వండర్‌లా తెరకెక్కిస్తున్న ఈ సినిమా రెండు లోకాల మధ్య పోరాటం నేపథ్యంలో సాగుతుందని, దైవశక్తి, క్షుద్రశక్తి మధ్య జరిగే పోరాటమే ఈ సినిమా ప్రధాన ఇతివృత్తమని సమాచారం. ముఖ్యంగా పిల్లలకు నచ్చే అంశాలు ఈ కథలో చాలా ఉంటాయని తెలుస్తున్నది. ఇందులో రెక్కల గుర్రంతో చిరంజీవి స్వారీ హైలైట్‌గా ఉంటుందట. మొత్తంగా ఈ సినిమా అభిమానులకు భారీ ట్రీట్ ఇవ్వనుందని యూనిట్‌వర్గాలు చెబుతున్నాయి. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అషికా రంగనాథ్, సురభి పురాణిక్ తదితరులు ఇతర పాత్రధారులు. వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం ఎం.ఎం.కీరవాణి, నిర్మాణం: యూవీ క్రియేషన్స్.

గన్స్ పట్టుకొని కనిపిస్తా!

'జాతిరత్నాలు' సినిమాలో చిట్టీ పాత్ర ద్వారా యువతరానికి చేరువైంది హైదరాబాదీ సొగసరి ఫరియా అబ్దుల్లా. ప్రస్తుతం ఈ భామ 'మత్తు వదలరా-2' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. శ్రీసింహా కోడూరి హీరోగా, రితేష్ రానా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఫరియా అబ్దుల్లా పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఇదొక థ్రిల్లర్ సబ్జెక్ట్. కథలోని విషాదం నుంచే కామెడీ పుడుతుంది. కథ విన్న వెంటనే ఓకే చేశా. శ్రీసింహా తొలిభాగంలో డెలివరీ బాయ్‌గా కనిపించగా.. ఈ సీక్వెల్‌లో స్పెషల్ ఏజెంట్‌గా కనిపిస్తారు. సినిమాలో నా పాత్ర పేరు సన్నిధి. తను కూడా స్పెషల్ ఏజెంట్' అని చెప్పింది. ఈ సినిమాలో తాను యాక్షన్ సీక్వెన్స్‌లో నటించానని, గన్స్ పట్టుకొని పోరాటాలు చేయడం కొత్త అనుభూతినిచ్చిందని, అలాగే ఓ పాటను రాసి పాడానని ఫరియా అబ్దుల్లా చెప్పింది. 'పాట రాసి పాడతానని డైరెక్టర్ రితేష్‌కు చెప్పినప్పుడు ఈ ఐడియా ఆయనకు బాగా నచ్చింది. వెంటనే ఓకే చేశారు. ఈ టీమ్ అన్ని అంశాల్లో నన్ను ఎంకరేజ్ చేసింది. మళ్లీ వారితో పనిచేయాలనుంది' అని ఆమె పేర్కొంది. ప్రస్తుత తెలుగులో తిరువీర్‌తో కలిసి ఓ లవ్‌స్టోరీలో నటిస్తున్నానని, త్వరలో ఓ తమిళ చిత్రం కూడా ప్రారంభం కాబోతుందని ఫరియా అబ్దుల్లా తెలిపింది.

జనవరిలో సెట్స్‌పైకి 'కింగ్'

పఠాన్, జవాన్ చిత్రాలతో కెరీర్‌లోనే అద్భుత విజయాలను సొంతం చేసుకున్నాడు అగ్ర హీరో షారుఖ్‌ఖాన్. ప్రస్తుతం ఆయన తదుపరి సినిమా కోసం సన్నద్ధమవుతున్నారు. 'కింగ్' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి సుజయ్‌ఘోష్ దర్శకత్వం వహిస్తారు. షారుఖ్ కుమార్తె సుహానా ఖాన్ ఇందులో కీలక పాత్ర పోషించనుంది. గతంలో 'ది ఆర్చిస్' చిత్రం ద్వారా ఓటీటీ వేదికపై ఆమె అరంగేట్రం చేసిన విషయం తెలిసిందే. 'కింగ్' చిత్రంలో షారుఖ్‌ఖాన్ శిష్యురాలి పాత్రలో సుహానా ఖాన్ కనిపిస్తుందని, లక్ష్యసాధనలో ఆమెకు మార్గ దర్శనం చేసే గురువుగా షారుఖ్‌ఖాన్ పాత్ర సాగుతుందని తెలిసింది. ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. జనవరిలో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందని మేకర్స్ తెలిపారు. యూరప్ నేపథ్యంలో యాక్షన్ ప్రధానంగా తెరకెక్కించనున్న ఈ చిత్రంలో షారుఖ్‌ఖాన్ పాత్ర శక్తివంతంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రంలో అభిషేక్ బచ్చన్ విలన్ పాత్రలో నటించబోతున్నాడు. 2026లో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

యువత మెచ్చే 'స్పీడ్ 220'

గణేశ్, హేమంత్, ప్రీతి సుందర్, జాహ్నవి ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'స్పీడ్ 220'. ఈ సినిమా విడుదల అవుతున్న సందర్భంగా చిత్రయూనిట్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. యువతరానికి వినోదంతో పాటు, ఓ విలువైన సందేశాన్ని కూడా ఈ సినిమా ద్వారా అందించామని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు నటీనటులంతా కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రానికి దర్శకుడు: హర్ష బేజాగం, నిర్మాతలు ఎం.సూర్యనారాయణ, ఎం.దుర్గారావు.

పదిహేనేండ్ల సినీ ప్రయాణం

ఈ సెప్టెంబర్ 5 నాటికి నాగచైతన్య తొలి సినిమా 'జోష్' విడుదలై పదిహేనేండ్లు. ఈ దశాబ్దంన్నర ప్రయాణంలో 28 సినిమాల్లో విభిన్నమైన పాత్రలు పోషించారు నాగచైతన్య. ఆయన 29వ చిత్రం 'తండేల్'. అక్కినేని లెగసీని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తూ తాతకు తగ్గ మనవడిగా, తండ్రికి తగ్గ తనయుడిగా నాగచైతన్య సత్తా చాటుతున్నారని, 'తండేల్'లో చైతూ నటవిశ్వరూపాన్ని చూస్తారని గురువారం మేకర్స్ తెలియజేస్తూ, నాగచైతన్యకు సంబంధించిన ఓ న్యూ పోస్టర్‌ని విడుదల చేశారు. సముద్రపు అంచున ఫిషింగ్ బోట్‌పై నిలబడి రగ్గ్‌డ్ అవతార్‌లో చిరునవ్వు చిందిస్తున్న చైతూ పోస్టర్ అభిమానుల్ని ఆకట్టుకునేలా వుంది. శ్రీకాకుళంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నది. సాయిపల్లవి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఎడిటింగ్: నవీన్ నూలి, నిర్మాత: బన్నీ వాసు, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాణం: గీతా ఆర్ట్స్

రూట్ మార్చిన రామ్



మాస్‌ని మెప్పించే ప్రతిభ పుష్కలంగా ఉన్న హీరో రామ్ పోతినేని. ఆయన సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా.. ఓపెనింగ్స్ మాత్రం భారీగానే ఉంటాయి. ప్రస్తుతం ఆయన సరైన విజయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఓ వైవిధ్యమైన దర్శకుడితో ఆయన చేతులు కలిపినట్టు ఫిల్మ్‌వర్గాల టాక్. ఆ దర్శకుడెవరో కాదు, 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' సినిమాతో డీసెంట్ హిట్‌ను అందుకున్న మహేశ్‌బాబు. ఆయన దర్శకత్వంలో త్వరలో రామ్ నటించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. మైత్రీమూవీమేకర్స్ వారు ఈ చిత్రాన్ని నిర్మించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రానున్నదని వినికిడి.

నా ఆస్తి హక్కుదారులు వాళ్లే..

మరణానంతరం తన ఆస్తి ఎవరికి దక్కాలి? అనే విషయంపై పూర్తి క్లారిటీతో ఉన్నారు బిగ్‌బీ అమితాబ్. ఇటీవల ఆయన ఇచ్చిన ఓ ఇంటర్‌వ్యూలో తన తదనంతరం ఆస్తి పంపకాలు ఎలా జరగాలో బిగ్‌బీ వివరించారు. 'నాకు ఇద్దరు పిల్లలు. అభిషేక్, శ్వేతా. నా ఆస్తిలో వీరిద్దరికీ సమాన వాటా ఉంటుంది. ఈ విషయంపై నేను, నాభార్య జయ ఎప్పుడో ఓ నిర్ణయానికొచ్చాం. కూతురు 'పరాయా ధన్' అని అందరూ అంటారు. ఆమె మన సంప్రదాయాన్ని అనుసరించి తన భర్త ఇంటికి వెళ్లింది. అంతమాత్రం చేత నా కూతురు కాకపోదుకదా. నా ఆస్తి విషయంలో అభిషేక్‌కి ఉన్న హక్కులన్నీ నా కుమార్తె శ్వేతకు కూడా ఉంటాయి. నా మరణానంతరం నా ఆస్తిని వారిద్దరూ సమానంగా పంచుకుంటారు. నా అభిప్రాయాన్ని అభిషేక్ గౌరవిస్తాడనే అనుకుంటున్నా. ఎందుకంటే తననెప్పుడూ నేను కొడుకుగా చూడ్లేదు. స్నేహితుడిగానే చూశా. మా ఇద్దరి బంధం మాటలకు అతీతమైనది.' అని తెలిపారు బిగ్‌బీ. గత ఏడాది అమితాబ్ తనకెంతో ఇష్టమైన 'జల్సా' బంగ్లాను కుమార్తె శ్వేతా బచ్చన్ నందాకు బహుమతిగా ఇచ్చిన విషయం తెలిసిందే. దాని విలువ ఇప్పుడు 50కోట్ల పై మాటే అని సమాచారం.

అగ్రనటి సాయిపల్లవి ఇంట్లో పెళ్లి బాజా మోగింది. ఆమె చెల్లెలు, నటి పూజా కన్నన్ వివాహం ఆమె స్నేహితుడు వినీత్‌తో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో సాయిపల్లవి సందడి చేసింది. సంప్రదాయ దుస్తులు ధరించి ఆ వేడుకలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతేకాక సోదరితో కలిసి ఆ వేడుకలో నాట్యం చేసి ఆ వేడుకకే కొత్త అందాన్ని తెచ్చింది సాయిపల్లవి. ఆ డాన్స్ చూసిన వారంతా ఫిదా అయిపోతున్నారు. ఈ ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట ఓ స్థాయిలో వైరల్ అవుతున్నాయి. సాయిపల్లవి అభిమానులంతా పెద్ద ఎత్తున కొత్త జంటకు శుభాకాంక్షలు అందిస్తున్నారు. ఇదిలావుంటే.. సాయిపల్లవి సోదరి పూజా దక్షిణాది ప్రేక్షకులకు సుపరిచితురాలే. ఆమె కోలీవుడ్‌లో 'చితిరై సెవ్వానం' అనే సినిమాతో నటిగా అరంగేట్రం చేసింది. 2012లో విడుదలైన ఈ సినిమాలోని పూజ నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి.